


బాబి, సురేందర్ రెడ్డి, జ్ఞానవేల్‌రాజా, విక్రమ్, పా.రంజిత్

## 'తంగలాన్'లో జీవితాన్ని చూస్తారు!

'నేను నటించిన శివపుత్రుడు, అపరిచితుడు, నాన్న, ఐ వంటి సినిమాల తరహాలో 'తంగలాన్' ఓ విభిన్న చిత్రం. ఈ సినిమాలో జీవితం కనిపిస్తుంది' అన్నారు తమిళ అగ్ర హీరో విక్రమ్. పా.రంజిత్ దర్శకత్వంలో స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మించారు. జనవరి 26న పాన్ ఇండియా స్థాయిలో విడుదలకానుంది. బుధవారం హైదరాబాద్‌లో టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ 'సినిమాల తాలూకు గ్లామర్‌ను ఏమాత్రం పాటించకుండా తెరకెక్కించిన చిత్రమిది. దర్శకుడు తనదైన ఫిలాసఫీ, దృక్పథాన్ని ఈ సినిమాలో చూపించారు. ప్రేక్షకులను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. ఈ సినిమాలో డ్యూయల్ రోల్ చేశాను. రెండు పాత్రల్లో సహజంగా కనిపించేందుకు చాలా శ్రద్ధ తీసుకున్నా. పా.రంజిత్ దర్శకత్వంలో వచ్చిన గొప్ప సినిమాల్లో ఇదొకటిగా నిలిచిపోతుంది' అన్నారు. 'విక్రమ్ డైరెక్టర్స్ యాక్టర్. ఒక్కసారి స్క్రిప్ట్ అంగీకరించిన తర్వాత దర్శకుడు సెట్‌లో ఏది చెబితే అదే చేస్తాడు. ఆయనలో ఎలాంటి ఈగో ఉండదు. నా కెరీర్‌లో 'తంగలాన్' విభిన్న చిత్రమవుతుంది' అని దర్శకుడు పా.రంజిత్ చెప్పారు. తమిళ ప్రజలు తెలుగు సినిమాలను ఆదరించడం లేదన్నది తప్పుడు అభిప్రాయమని, 'బాహుబలి-2' తమిళనాట రెండేళ్లపాటు హయ్యెస్ట్ గ్రాసర్‌గా రికార్డు కొనసాగించిందని నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకులు కరుణకుమార్, వేణు ఊడుగుల, బాబి, సురేందర్ రెడ్డి, మధుర శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రితిక నాయక్, ఆనంద్ దేవరకొండలపై క్లాప్ ఇస్తున్న హరీశ్‌శంకర్

## 'డ్యూయట్' ప్రారంభం

యువహీరో ఆనంద్ దేవరకొండ నటిస్తున్న తాజా చిత్రం 'డ్యూయట్' గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ప్రముఖ డైరెక్టర్ మురుగదాస్ శిష్యుడు మిథున్ వరదరాజ కృష్ణన్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. రితిక నాయక్ కథానాయిక. స్టూడియోగ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. మధుర శ్రీధర్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు హరీశ్‌శంకర్ క్లాప్‌నివ్వగా, గోవర్ధన్ రావు దేవరకొండ, మాధవి కెమెరా స్విఛాన్ చేశారు. ఎమోషనల్ లవ్‌స్టోరీగా ప్రేక్షకులను మెప్పిస్తుందని దర్శకుడు చెప్పారు. త్వరలో ఫస్ట్ షెడ్యూల్ ప్రారంభిస్తామని నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా తెలిపారు. వైవిధ్యభరితమైన ప్రేమకథగా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందని కో ప్రొడ్యూసర్ మధుర శ్రీధర్ రెడ్డి అన్నారు. తన కెరీర్‌లోనే ఇదొక స్పెషల్ మూవీ అని హీరో ఆనంద్ దేవరకొండ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: అరుణ్ రాధాకృష్ణన్, సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, ప్రొడక్షన్ డిజైనర్: ఉదయకుమార్, రచన-దర్శకత్వం: మిథున్ వరదరాజ కృష్ణన్.

## కేటీఆర్ సలహా నచ్చింది!



సెబాస్టియన్

'దర్శకుడిగా తొలి సినిమా అవకాశం రావడమే కష్టం అనుకుంటే.. షూటింగ్ టైమ్‌లో జరిగిన ప్రమాదంలో నా కుడి చేయిని కోల్పోయా. అయినా ఆత్మవిశ్వాసంతో సినిమా పూర్తిచేశా' అన్నారు దర్శకుడు సెబాస్టియన్. ఆయన నిర్దేశకత్వంలో రక్షిత్ అట్లూరి, అపర్ణ జనార్ధన్, సంకీర్తన విపిన్ ప్రధాన పాత్రల్లో నటించిన 'నరకాసుర' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సెబాస్టియన్ మాట్లాడుతూ 'ఈ సినిమా కథ రాసుకొని మరింతగా డెవలప్ చేసే టైమ్‌లో 'భరత్ అనే నేను' సినిమాకు సంబంధించి ఓ ఈవెంట్‌లో పాల్గొన్న మంత్రి కేటీఆర్‌గారి వీడియో చూశాను. అందులో ఆయన 'ట్రాన్స్‌జెండర్స్‌ను సినిమాల్లో కమర్షియల్‌గా చూపిస్తున్నారు అలా కాకుండా వాళ్ల సమస్యలతో సినిమా చేస్తే బాగుంటుంది' అని సూచించారు. అది నాకు బాగా నచ్చింది. కేటీఆర్‌గారి మాటల స్ఫూర్తితో ఈ సినిమా కథలో ట్రాన్స్‌జెండర్ అనే అంశాన్ని చేర్చాం. సినిమా మొత్తం హిజ్రాల నేపథ్యంలో ఉండదు. కానీ అదొక కీలకమైన పాయింట్‌గా కథ సాగుతుంది. పురాణాల్లో 'నరకాసురుడు' రాక్షసుడు కాకముందు గొప్ప రాజు. భూదేవిపుత్రుడు. ఈ సినిమాలో హీరో అలాగే గొప్ప వ్యక్తిత్వంతో ఉంటాడు. రాక్షసుడిగా మారాల్సి వచ్చినప్పుడు మాత్రం నరకాసురుడి కంటే చెడ్డగా మారతాడు. కథానుగుణంగానే టైటిల్ పెట్టాం' అన్నారు.



రాశీఖన్నా



సత్యం రాజేష్

## ఓ సీన్‌లో నగ్నంగా కనిపిస్తా

'నేను హీరోని కాదు. ఆర్టిస్టుని. ప్రతిభావంతుడైన నటుడిగా పేరు తెచ్చుకోవాలన్నదే నా తపన. నన్ను నేను కొత్త పంథాలో ఆవిష్కరించుకోవాలనుకుంటున్నా' అన్నారు సత్యం రాజేష్. ఆయన ప్రధాన పాత్రలో డా॥ అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'మా ఊరు పొలిమేర-2' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా సత్యం రాజేష్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'తొలిభాగానికి అద్భుతమైన స్పందన రావడంతో సీక్వెల్ విషయంలో నిర్మాతలు ఖర్చుకు ఎక్కడా వెనకాడలేదు. చక్కటి నాణ్యతతో తెరకెక్కించారు. ఈ సినిమాలో షాకింగ్ ట్విస్ట్‌లుంటాయి. మొదటి పార్ట్ చూడకపోయినా ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారు. స్వతహాగా నేను చేతబడుల వంటి వాటిని నమ్మను. అయితే ఫారెస్ట్‌లో షూటింగ్ సందర్భంగా శ్మశానంలో చేతబడుల సన్నివేశాలను షూట్ చేస్తున్నప్పుడు మాత్రం ఎందుకో కాస్త భయం అనిపించింది. ఈ సినిమాలో కథ డిమాండ్ మేరకు ఓ సన్నివేశంలో నగ్నంగా కనిపిస్తాను. నటుడిగా ఇరవైఏండ్ల కెరీర్‌ను పూర్తి చేసుకున్నా. కామెడీతో పాటు నటుడిగా నన్ను నేను ప్రూవ్ చేసుకునేందుకు విభిన్న పాత్రలు చేయాలనుకుంటున్నా. 'మా ఊరు పొలిమేర-2' నా కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలిచిపోయే చిత్రమవుతుంది. ప్రస్తుతం 'టెనెంట్' అనే సినిమాలో లీడ్ రోల్ చేస్తున్నా' అని చెప్పారు.



## అరుదైన గౌరవం

'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం ద్వారా ప్రపంచవ్యాప్తంగా పేరు సంపాదించుకున్నారు అగ్ర హీరో రామ్‌చరణ్. తాజాగా ఆయన ఓ అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. ప్రతిష్టాత్మక ఆస్కార్ యాక్టర్స్ బ్రాంచ్‌లో సభ్యత్వం పొందారు. 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలో సీతారామరాజు పాత్రలో అద్భుతాభినయాన్ని ప్రదర్శించినందుకుగాను ఆయనకు స్థానం దక్కింది. ఆస్కార్ అవార్డుల కమిటీ ఇటీవల యాక్టర్స్ బ్రాంచ్‌లో కొత్త సభ్యులను చేర్చుకుంది. ప్రపంచ సినిమాలో ప్రముఖ నటీనటులు చోటు దక్కించుకున్నారు. తాజాగా ఇందులో రామ్‌చరణ్ జాయిన్ అయ్యారు. ఈ విషయాన్ని ఆస్కార్ కమిటీ తన సోషల్‌మీడియా ఖాతా ద్వారా పంచుకుంది. రామ్‌చరణ్‌తో పాటు కొంత మంది హాలీవుడ్ నటులు కూడా ఈ జాబితాలో ఉన్నారు. ఈ యాక్టర్స్ బ్రాంచ్‌లో ఎన్టీఆర్ కూడా స్థానం దక్కించుకున్న విషయం తెలిసిందే. తెలుగు నుంచి ఇద్దరు అగ్ర హీరోలు ఈ యాక్టర్స్ బ్రాంచ్‌లో స్థానం పొందడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## రవితేజ జోడీగా..

పంజాబీ ముద్దుగుమ్మ రాశీఖన్నాకు గత కొంతకాలంగా తెలుగు సినిమాల్లో అవకాశాలు తగ్గిపోయాయి. అయితే హిందీ, తమిళ ఇండస్ట్రీల్లో మాత్రం అవకాశాలను దక్కించుకుంటున్నది. సినిమాలతో పాటు వెబ్‌సిరీస్‌ల్లో నటిస్తూ బిజీగా ఉంది. తాజా సమాచారం ప్రకారం ఈ భామ తెలుగులో భారీ ఆఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే..రవితేజ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనుంది. హ్యాట్రిక్ హిట్ తర్వాత రవితేజ-గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. ఈ సినిమాలో రెండో నాయికగా రాశీఖన్నా పేరును పరిశీలిస్తున్నట్లు తెలిసింది. దాదాపుగా ఆమె ఖరారయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు. ప్రస్తుతం ఈ భామ హిందీ, తమిళంలో రెండేసి చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.



కార్తీ

## సమాజంపై వ్యంగ్యాస్త్రం 'జపాన్'

తమిళ హీరో కార్తీని వైవిధ్యమైన కథలకు చిరునామాగా అభివర్ణిస్తారు. కమర్షియల్ సినిమాల్లోనే పాత్రలపరంగా ప్రయోగాలు చేస్తుంటారు. ఆయన తాజా చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకుడు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్.ఆర్.ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు నిర్మించారు. అన్నపూర్ణ స్టూడియోస్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నది. దీపావళి కానుకగా విడుదలకానుంది. ఈ సందర్భంగా గురువారం హీరో కార్తీ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..

వాస్తవ సంఘటనల స్ఫూర్తితో రాసుకున్న కథాంశమిది. దర్శకుడు రాజు మురుగన్ నిజజీవితంలో చూసిన అనుభవాలు ఇందులో ఉంటాయి. స్క్రిప్ట్ చదువుతున్నప్పుడే అవుట్ ఆఫ్ ది బాక్స్ సినిమా అనిపించింది. ప్రతి సన్నివేశం కొత్తగా ఉంటుంది. 'జపాన్' అని పేరెందుకు పెట్టామో సినిమా చూస్తేనే అర్థమవుతుంది. ఈ సినిమాలో డార్క్ కామెడీతో పాటు మంచి సెటైర్ ఉంటుంది. మాస్ యాంగిల్‌తో పాటు చక్కటి వినోదం ఉన్న పాత్రను పోషించాను. ఈ సినిమాలో కొత్త కార్తీని చూస్తారు.

### యూనివర్సల్ కాన్సెప్ట్

కొందరు వ్యక్తుల పర్సనాలిటీకి, వాళ్ల వాయిస్‌కు సంబంధం ఉండదు. మనిషి బలంగా ఉంటాడు కానీ వాయిస్ పీలగా ఉంటుంది. జపాన్ పాత్ర కోసం అలాగే ప్రయత్నించా. అది అద్భుతంగా కుదిరింది. ఈ సినిమాలో కామెడీతో పాటు నేటి సమాజాన్ని ప్రతిబింబించే అనేక అంశాలుంటాయి. వాటన్నింటిని వ్యంగ్యంగా చెప్పాం. యూనివర్సల్ కాన్సెప్ట్‌తో అందరికి కనెక్ట్ అవుతుంది. జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. రెండున్నర గంటల పాటు ప్రేక్షకులు మరో ప్రపంచంలో విహరించిన అనుభూతినందిస్తుందీ చిత్రం.

### 'ఖైదీ'కి సీక్వెల్..?

'ఖైదీ-2' కోసం ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. 'జపాన్' చిత్రానికి కూడా సీక్వెల్ తీయాలని దర్శకుడికి చెప్పాను. ఏం జరుగుతుందో చూద్దాం. ప్రస్తుతం 'సూదుకవ్వం' దర్శకుడితో ఓ సినిమా చేస్తున్నా. అలాగే '96' దర్శకుడుప్రేమ్‌కుమార్‌తో కూడా ఓ చిత్రం ఉంటుంది. 'సర్దార్-2' సినిమా కూడా చేయబోతున్నా. ఆ వివరాలన్నీ త్వరలో తెలియజేస్తా.





